# పందెం

సి. ఎస్. చంద్రశేఖర్

ఆదిత్య కారు దగ్గరికి వచ్చి నిలబడి చుట్టూ చూశాడు. అమావాస్య కావడం వల్ల చుట్టూ చీకటిగా ఉంది. ఆ హోటల్ వెలుపల ఉన్న లైటు వెలుతురు కొంతదూరం వరకే పడుతుంది. గాలి వేగంగా వీస్తూందనిపించింది అతనికి ఊగుతున్న చెట్లను చూస్తుంటే.

అతనికి ఒక క్షణం భయం వేసింది. ఒక్క క్షణమే. ఆ తర్వాత మరేం ఆలోచించకుండా కారెక్కాడు. కారు స్టార్ట్ చేసి హెడ్‌లైన్స్ ఆన్ చేశాడు. చీకటిని దూరం చేస్తూ వెలుతురు అతని కారు ముందు పరచుకోవడం చూశాడు. తలపైకెత్తి బాల్కనీ వైపు చూశాడు. రమేష్, వినోద్ నిలబడి ఉన్నారు. రమేష్ తన బొటనవేలు పైకెత్తి 'థమ్సప్' స్టయిల్లో చూపించాడు. ఆదిత్య కూడా తన బొటనవేలు అతని వైపు చూపించి కారును ముందుకు కదిలించాడు.



కారు వేగంగా పోతూంది. అతని ఆలోచనలు కొంతసేపటి క్రితం రమేష్‌తో జరిపిన సంభాషణల మీదికి మళ్లాయి. మరుసటిరోజు సెలవుదినం ఆవడంతో స్నేహితులు ముగ్గురూ ఊరికి దూరంగా ఉన్న ఆ హోటల్‌లో డిన్నర్ చేయడానికి వచ్చారు. మాట్లాడుకుంటూ భోంచేస్తున్న సమయంలో సంభాషణ దయ్యాలమీదకు మళ్ళింది. రమేష్ దయ్యాలు ఉన్నాయనీ, తాను ప్రత్యక్షంగా చూడకపోయినా వాటి ప్రభావం కళ్ళారా చూశాననీ వాదించాడు. ఆదిత్య ఈ ట్వంటీ ఫస్ట్ సెంచరీలో దయ్యాల గురించి మాట్లాడటమే తెలివితక్కువతనమని, చదువుకున్న వాళ్ళు కూడా అటువంటి ఆలోచనలు కలిగి ఉండటం తనను బాధిస్తూందని అన్నాడు. మాటామాటా పెరిగి యిద్దరిలో తమ వాదన గెలవాలన్న పట్టుదల పెరిగింది. ఫలితంగా పదివేల రూపాయల పందేనికి ఒప్పుకున్నారు యిద్దరూ. పందెం ప్రకారం ఆదిత్య ఆ హోటల్‌నుంచి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న టౌనుకు కారులో వెళ్లి ఓ స్కాచ్ బాటిల్ తీసుకురావాలి. అదీ అర్ధరాత్రి పన్నెండు గంటలకు హోటల్నుంచి బయలుదేరాలి. దారిలో ఎవర్నీ తోడుగా కారులో ఎక్కించు



కోకూడదు. ప్రయాణం మానుకుని తిరిగి వచ్చినా, భయంతో స్పృహ తప్పినా అతను ఓడినట్లు నిర్ణయింపబడుతుంది. ఎటువంటి భయాలూ లేకుండా స్కాచ్ బాటిల్‌తో బాటు షాపు వాడిచ్చిన బిల్లు తెచ్చి చూపిస్తే రమేష్ అతనికి పదివేలు యిస్తాడు.

సన్నగా తుంపరలు మొదలయ్యాయి. క్షణాల్లో జోరందుకుంది వర్షం. ఆదిత్య కారు వైపర్స్‌ని ఆన్ చేశాడు. కారు వేగం తగ్గించి, చేతులు స్టీరింగ్ వీల్ మీద నుంచి తీసి, జేబులోంచి సిగరెట్ తీసి లైటర్‌తో వెలిగించాడు. లైటర్ జేబులో వేసుకుని మళ్ళీ స్టీరింగ్ వీల్‌పై చేతులుంచాడు. అప్పుడు తోచింది అతనికి– లైటర్ పట్టుకున్నప్పుడు అతని చేయి స్వల్పంగా వణికిందని.'

అతను ఆశ్చర్యపోయాడు.

తను భయపడుతున్నాడా? తను యీ రూటులో కాదుగాని, 'అర్ధరాత్రి దాటాక ఎన్నో రూట్లలో ఒంటరిగా ప్రయాణించాడు. ఎలాంటి భయాలు లేకుండా ప్రయాణించాడు. మరి యీ రోజు ఎందుకు తను భయపడుతున్నాడు? 'బహుశ దయ్యాల గురించి చర్చ జరిగినందువల్ల కావచ్చు లేదా రమేష్ దయ్యాలున్నాయన్న తన వాదనకు బలం చేకూరడానికి వివరంగా చెప్పిన సంఘటనలను గురించి తను ఆలోచిస్తున్నందువల్ల కావచ్చు. అంతేకాదు. పందెంలో గెలవాలన్న పట్టుదల కూడా తనలో ఆందోళనని, భయాన్ని సృష్టిస్తూంది.' అనుకున్నాడు మనసులో.

అతని ఆలోచనలకు భంగం కలిగించింది ఎదురుగా కనిపించిన దృశ్యం. వానలో తడుస్తూ నడిరోడ్డు మీద నిలుచుని ఉంది ఓ యువతి. ఆమె తెల్ల చీర, తెల్ల రవిక ధరించి ఉంది. కారును ఆపమన్నట్టు చేయి ఊపుతుంది. ఆమె రోడ్డు మధ్యన నిలబడి ఉండటంతో అతనికి కారు ఆపక తప్పింది కాదు. ఆమె అతని కారును సమీపిస్తూంటే పరిశీలనగా చూశాడు. ఆమె చాలా అందంగా ఉంది. వానలో తడవటం వల్ల ఆమె అందాలు స్పష్టంగా కనబడుతున్నాయి.

## అయేషా మనసు

"నాకు చాలా మామూలు అమ్మాయిలా వుండాలంటే ఇష్టం. నటిని కాబట్టి ప్రత్యేకంగా వుండాలని నేను అనుకోను. ఉదయం ఏడు గంటలకి నిద్ర లేవడం నాకు అలవాటు. వెంటనే షూటింగ్‌కి రెడీ అయిపోతాను. లేట్‌గా వెళ్ళడం నాకిష్టముండదు. నాకు మా చెల్లి అంటే ఇష్టం. కానీ 17 ఏళ్ళకే అది ముసలమ్మలా మాట్లాడుతుంది. నేను సినిమాల్లో నటించడం దానికిష్టం లేదు. నా బాయ్‌ఫ్రెండ్స్ గురించి పత్రికలకు చెప్పడం నాకిష్టంలేదు. అది నా పర్సనల్. నాకు కెమెరా అంటే భయంలేదు. చిన్నప్పటినుంచి అలవాటే. కెమెరా ముందు ఇతరులు నటిస్తున్నప్పుడు నాకు చాలా ఐడియాలు వస్తాయి. ఆ సన్నివేశంలో నేనైతే ఇంకా ఎంత బాగా నటించగలనో అని ఆలోచిస్తాను. ఒక్కోసారి సలహాలు చెబుతూ వుంటాను" – అయేషా అంతరంగమిది.

ఆమె కారుకు ఎడమవైపు వచ్చి నిలబడడంతో ఆదిత్య షట్టర్స్‌ని కొద్దిగా క్రిందికి దించాడు. ఆమె తల కిటికీ దగ్గరగా పెట్టి ''మా నాన్నకు సీరియస్‌గా ఉంది. డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాలి. కాస్త లిఫ్ట్ యిస్తారా?'' అని అడిగింది.

''మీ నాన్నగారు ఎక్కడ ఉన్నారు?'' అనుమానంగా ఆమెను చూస్తూ అడిగాడు.

''అక్కడ...మాయింట్లో' దూరంగా చేయి చూపిస్తూ అంది. ఆదిత్య ఆమె చూపించిన వైపు చూశాడు. దట్టంగా చెట్లు పెరిగి అవి జుట్టు విరబోసుకున్నట్లు కనిపించింది అతనికి. అక్కడ ఓ యిల్లు ఉంటుందని అతనికి నమ్మబుద్ధి కాలేదు.

'ఈమె దారి దోపిడి ముఠాకు చెందిన మనిషి అయి ఉండవచ్చు. ఆమెను కారులో ఎక్కించుకోవడం మంచిది కాదు' అనుకున్నాడు. అప్పుడే 'అతను ఒంటరిగా ప్రయాణం చేయాలన్న' రమేష్ కండిషన్ కూడా గుర్తొచ్చింది.

''సారీ. నేను ఓ అర్జెంటు పనిమీద వెళ్తున్నాను. ఇంకేదైనా వెహికల్ వస్తే ప్రయత్నించండి.'' అంటూ కారును ముందుకు

కదిలించాడు.

కారు కదులుతున్నప్పుడు ఆమె వైపు చూసిన ఆదిత్య ఉలిక్కిపడ్డా ఆమె వికృతంగా మొహం పెట్టి నవ్వుతూంది.

ఆదిత్య కారు వేగం పెంచి మరో సిగరెట్ వెలిగించాడు. అతను ఆ అమ్మాయి గురించే ఆలోచిస్తున్నాడు. 'ఆమె ఎందుకలా నవ్వింది? కొంపదీసి తను పిచ్చిదా? నిజంగా తండ్రికి అనారోగ్యమైతే అలా నవ్వదు. దోపిడి దొంగే అయితే ఎలాగోలా కారు ఆపే ప్రయత్నమే చేసేది గాని అలా నవ్వేది కాదు. మరి ఆమె ఎవరు? దయ్యమా?''

అతనికి ఒళ్ళంతా చెమటలు పట్టింది. కర్చీఫ్‌తో మొహం తుడుకుకుని, స్పీడో మీటరు వైపు చూసి 'యింకా పన్నెండు కిలోమీటర్లు ప్రయాణించాలి' అనుకున్నాడు. మరో అయిదు కిలోమీటర్లు ప్రయాణించాక వాన నిలిచిపోయింది. కారు వైపర్స్ ఆఫ్ చేశాడు. రోడ్డును పరిశీలనగా చూసి 'యిక్కడ తుంపరలు పడిన ఛాయలు కూడా లేవు' అనుకుంటూ ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి ఆశ్యర్యపోయాడు. తెల్లచీర, తెల్ల రవిక ధరించిన ఓ యువతి రోడ్డు మధ్యలో నిలబడి కారు ఆపమన్నట్టు చేయి ఊపుతూంది. ఆదిత్యకు కారు ఆపక తప్పింది కాదు.

ఆమె నడచి అతన్ని సమీపిస్తూంటే చూచిన ఆదిత్య ఆశ్యర్యంతో నోరు తెరిచాడు. ఆమె పూర్తిగా తడిసిపోయి ఉంది.. అక్కడ... వర్షం... పడకపోయినా. ఆమె కారు దగ్గరికి వచ్చి ''మా నాన్నకు సీరియస్‌గా ఉంది. హాస్పిటల్‌కు తీసుకెళ్ళాలి. కాస్త సహాయం చేస్తారా?'' అని అడిగింది తన మొహం షట్టర్ దగ్గరగా పెట్టి.

కారు లోపలున్న లైటు వెలుతురులో ఆమెను చూసిన ఆదిత్య షాక్ తిన్నాడు. ఆమె కొంతసేపటిక్రితం తనను లిఫ్ట్ అడిగిన అమ్మాయ్. తనకు తెలిసి ఏ వాహనం తన కారును దాటిపోలేదు. మరి ఆ అమ్మాయి అయిదు కిలోమీటర్లు ఎలా ప్రయాణం చేసింది? గాల్లో ప్రయాణించిందా? లేక అక్కడ మాయమై యిక్కడ ప్రత్యక్షమయిందా? అంటే యీమె ద...య్యా...మా? అనుకున్నాడు.

ఆ ఆలోచన రావడంతోనే అతని వెంట్రుకలు నిక్కపొడుచుకున్నాయి భయంతో. వెంటనే కారును ముందుకు దూకించాడు. ఆ అమ్మాయి కూడా మొహం వికృతంగా పెట్టి నవ్వడం చూసిన అతనికి నాలుక పిడుచకట్టుకు పోయింది.

'తను పందెం వేసుకుని యిలా రాకుండా ఉండాల్సింది. ఈ రూట్‌లో దయ్యాలు తిరుగుతున్నాయని రమేష్ ఎప్పట్నుంచో చెబుతున్నాడు. నిజానికి తన వాదన గెలవాలన్న ఆవేశంతో పందెం ఒప్పుకున్నాడు గాని తనేం అసాధారణమైన ధైర్య సాహసాలు ఉన్నవాడు కాదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. తను క్షేమంగా టౌను చేరుకుంటే రమేష్‌కు ఫోన్ చేసి తను పందెం ఓడిపోయానని చెప్పాలి. ఈ మార్గంలో తిరుగు ప్రయాణం చేసే ధైర్యం తనకు లేదు' అనుకున్నాడు.

దూరంగా టౌనులోని వీధి దీపాలు కనబడుతూంటే అతనికి ధైర్యం వచ్చింది. 'ఇంకెంత? మరో మూడు కిలోమీటర్లు' అనుకుంటూ ఎదురుగా రోడ్డుకు అడ్డంగా నిలబడి ఉన్న అమ్మాయిని చూచి సడన్ బ్రేక్ వేశాడు.

'ఆ అమ్మాయి ఆ అ...మ్మా...య్.. అదే తెల్లచీర, అదే తెల్ల రవిక' ఆదిత్య తనలో తానే గొణుక్కుంటున్నాడు. ఆమె కారు వైపు అడుగులు వేయసాగింది. ఆదిత్య భయంతో స్పృహ తప్పాడు.

***

''ఎలా ఉన్నావు?''

హాస్పిటల్‌లో ఆదిత్యను పలుకరించాడు రమేష్. ఫరవాలేదన్నట్టు నీరసంగా తలూపాడు ఆదిత్య.

''ఏమైంది?'' వినోద్ అడిగాడు కుతూహలంగా.

ఆదిత్య జరిగింది చెప్పాడు. అతను చెబుతున్నంతసేపూ అతని ఒళ్ళంతా వణుకుతూ ఉండటం గమనించారు రమేష్, వినోద్.

''అంటే దయ్యాలున్నాయని యిప్పుడు నమ్ముతున్నావా?'' వినోద్ ఆదిత్యను అడిగాడు.

''అవును.''

''లేదు ఆదిత్యా. నిజంగా దయ్యాలు లేవు. వాళ్ళు నేను అరేంజ్ చేసిన అమ్మాయిలు. పందెం గెలవాలన్న పట్టుదలతో నేను ప్లాను చేసి నా స్నేహితుని ద్వారా అమలు పరచాను. అయితే పందెం నేను గెలిచినా న్యాయంగా గెలవలేదు. అందువల్ల నువ్వు నాకు పందెం డబ్బులు యివ్వనక్కరలేదు.'' అన్నాడు రమేష్.


''అంటే యిదంతా నువ్వు చేసిందా?'' ఆశ్చర్యంగా అడిగాడు ఆదిత్య. మళ్ళీ ''ఉహూ. నేను నమ్మను. ఆ అమ్మాయిలందరూ ఒకేలా ఉన్నారు. కనుముక్కుతీరుతోసహా. వచ్చింది ఒకమ్మాయ్. ఆమె కూడా అమ్మాయి కాదు. దయ్యం.'' అన్నాడు స్థిరంగా.

''నిజం ఆదిత్యా. నీకు మొదట కనిపించిన అమ్మాయిలిద్దరూ నా స్నేహితుని పిల్లలు. వాళ్ళు కవలలు. మూడో అమ్మాయి వాళ్ళ కజిన్. మూడో అమ్మాయిని పూర్తిగా చూడకముందే నువ్వు స్పృహ తప్పావు.''

'ఆమాట నిజమేనన్నట్టు' ఆదిత్య నవ్వాడు. అతనిలో భయం తగ్గింది.

అప్పుడే గదిలోకి అడుగుపెట్టిన డాక్టర్ శ్రీకాంత్ వీళ్ళ సంభాషణ విన్నాడు. అతను సీరియస్‌గా రమేష్ వైపు చూస్తూ ''మీరు చేసింది మంచి పని కాదు. ఆదిత్య స్థానంలో కాస్త బలహీనమైన గుండె కలవాళ్ళు ఉండి ఉంటే ఈపాటికి ప్రాణాలు కోల్పోయేవాళ్ళు. ప్రాణాలు తీసే






పందేలూ, ప్రాక్టికల్ జోక్స్ వేసుకోకూడదు.'' అన్నాడు.

''సారీ డాక్టర్. ఐ యామ్ రియల్లీ సారీ'' అన్నాడు రమేష్. అతని మొహంలో పశ్చాత్తాపం కనిపించింది.

తర్వాత ఆదిత్య దగ్గర శెలవు తీసుకుని బయటకు వచ్చారు స్నేహితులిద్దరూ. కారులో కూర్చున్నాక వినోద్ రమేష్ వైపు చూస్తూ

''యు ఆర్ గ్రేట్ రమేష్. మీ మధ్య పందెం కుదిరింది పదిగంటలకు. పదకొండు గంటల వరకూ మనం కలిసే ఉన్నాం. పన్నెండుకు ఆదిత్య బయలుదేరాడు. ఆ ఒక్క గంటలో యిన్ని ఏర్పాట్లు చేయడం ఒక ఎత్తయితే అసలు యింత అద్భుతమైన ఆలోచన నీకు రావడం యింకా గొప్ప విషయం'' అన్నాడు.

''నేను సరిగ్గా యిలాంటి ప్లానే ఆలోచించాను కాని ఆచరణలో పెట్టలేకపోయాను.'' అన్నాడు రమేష్.

వినోద్ అర్థంకానట్లు చేశాడు.

''నిన్న రాత్రి ఆవేశంతో పందెం అయితే వేశాను గాని నేను గెలుస్తానా లేదా అన్న విషయం ఆలోచించలేదు. అయితే ఆదిత్య ధైర్యం చూస్తే నాకు భయం వేసింది. ఒకవేళ అతను ఏ ఆటంకం లేకుండా తిరిగొస్తే నేను ఓడినట్లవుతుంది. అందుకే బాగా ఆలోచించాను. అప్పుడు తోచింది యీ ప్లాను. వెంటనే కవలపిల్లలున్న నా స్నేహితునికి ఫోన్ చేశాను. అతను ఒప్పుకోకపోగా నన్ను చీవాట్లేశాడు. అర్థరాత్రి ఆడపిల్లల్ని అడవిలోకి పిలుచుకుని రమ్మనడానికి నీకు మనసెలా వచ్చిందని ప్రశ్నించాడు. నాకూ అలా అడగడం తప్పే అనిపించింది. అందువల్ల పందెం ఓడిపోవడానికి సిద్ధపడ్డాను. అయితే ఆశ్చర్యంగా నేను ఏదైతే ప్లాను చేశానో అదే జరిగింది.''

''మరి యివన్నీ నువ్వే చేశావని వాడితో అన్నావు?'' ఆశ్చర్యంగా అడిగాడు వినోద్.

''ఆదిత్య జరిగిన సంఘటనలతో బాగా షాక్ తిన్నాడు. అతనిలో భయం పోవాలంటే అతను చూసింది దయ్యాన్ని కాదని, మనిషినేననిఅతను నమ్మాలి. అదుకే అలాచెప్పాను.''

''అయితే మరి ఆదిత్యకు కనిపించింది దయ్యమా?''

''కావచ్చు.'' భుజాలెగరేస్తూ అన్నాడు రమేష్.

***

హాస్పిటల్‌లో- తన గదిలోకి వచ్చిన ఆ అందమైన అమ్మాయిని చూసి ఆశ్చర్యపోయాడు ఆదిత్య.

''నమస్తే. నా పేరు సుధ.''

''నమస్తే. కూర్చోండి.'' కుర్చీ చూపించాడు.

''ఎలా ఉన్నారు?'' ఆమె కూర్చున్నాక అడిగింది.

''బాగున్నాను. మీరు ఎవరో నాకు తెలియదు. ఎవర్నో చూడటానికి వచ్చి పొరబాటుగా నా గదికి వచ్చారేమో!''

ఆమె నవ్వి ''లేదు. నేను మీ కోసమే వచ్చాను. మిమ్మల్ని యిక్కడ అడ్మిట్ చేసింది నేనే.'' అంది.

''థాంక్యూ. మీకు నేను ఋణపడి ఉన్నాను.''

''అసలు విషయం వింటే నామీద పడి రక్కుతారు దయ్యంలా.''

''ఎందుకు.''

''మీరు యిక్కడ ఉండటానికి కారణం నేనే.''

''నాకు అర్థం కావడం లేదు.''

''చెబుతాను. ఈ రోజు ఏప్రిల్ ఫస్ట్ కదా. మా ఫ్రెండ్స్ అందరం నిర్ణయించాము. అందుకోసం ఒక్కొక్కరి దగ్గర అయిదు వందల చొప్పున వసూలు చేసి పదివేలు సమీకరించాము. నేను అందరిలా పాత ట్రిక్స్ ప్రయోగించకుండా వినూత్నంగా ఉండాలని చాలా రోజుల ముందే బాగా ఆలోచించి ఓ పథకం సిద్ధం చేశాను.

అదేమిటంటే అర్థరాత్రి ఒంటరిగా కారులో వస్తున్న వ్యక్తికి దయ్యంలా ఎదురొచ్చి ఫూల్ చేయడం. అందుకోసం రాత్రి పూట అంతగా ట్రాఫిక్ ఉండని రోడ్డు ఎన్నుకున్నాము. మీ దురదృష్టం కొద్దీ మీరు మా కంట పడ్డారు.''

''అయితే మీరు మా రమేష్ అరేంజ్ చేసిన వాళ్ళు కాదా;''

''మీ రమేష్ ఎవరో నాకు తెలియదు. ఇది పూర్తిగా నా ఆలోచనే. మీరు చూస్తున్నది దయ్యమే అని మీరు నమ్మడానికి నా క్లాస్‌మేట్స్‌లో కవలల్ని ఉపయోగించాను. అయితే మీకు మూడవసారి కనిపించింది నేను. నేను ఊహించచట్లుగానే నన్ను పూర్తిగా చూడకుండానే మీరు స్పృహ తప్పారు.''

ఆదిత్య మొహం అవమానంతో ఎర్రబడింది. అది గమనించిన సుధ ''సారీ. మిమ్మల్ని యిబ్బంది పెట్టాను.'' అంది.

''నా యిబ్బంది సంగతి అటుంచండి. మీ ప్లాను కాస్త అడ్డం తిరిగుంటే మీరు యిబ్బందిలో పడి ఉండేవారు.'' కోపంగా అన్నాడు ఆదిత్య.

''ఎలా?'' అన్నట్టు చూసింది అతనివైపు.

''నాకు కనిపించింది దయ్యమనే భావంతో ఉన్న నేను భయంతో కారు ఆపకుండా, రోడ్డుకు అడ్డంగా నిలబడి ఉన్న మిమ్మల్ని గాని, మీ స్నేహితురాలిని గాని ఢీ కొట్టి వెళ్లిపోయి ఉంటే మీ పరిస్థితి ఎలా ఉండేది?''

భయంతో కళ్ళు పెద్దవి చేసి చూసింది అతని వైపు.

''ఆ పరిస్థితి ఊహించడానికే భయంగా ఉంది. నేను చేసింది తప్పని ఒప్పుకుంటున్నాను. ఆ క్షణంలో బహుమతి గెలవాలనే తపన తప్ప దాని వల్ల ఏర్పడే విపరీత పరిణామాల గురించి ఆలోచించలేదు. మీరు స్పృహ తప్పగానే నాకు ఎంతో భయం వేసింది. జీవితంలో మళ్ళీ ఎప్పుడూ యిలాంటి ప్రమాదకరమైన పథకాలు వెయ్యకూడదని నిశ్చయించుకున్నాను'' అంది.

ఆమె మాటలు ఆదిత్య కోపాన్ని తగ్గించాయి.

''అయినా అంత రాత్రిపూట ఒంటరిగా అలా రావడానికి మీకు భయం వెయ్యలేదా?''

''ఒంటరిగా రాలేదు. ప్రతిచోటా పదిమంది మగపిల్లలు మాతో ఉన్నారు. చెట్లచాటున కార్లు పార్క్ చేసి ఉండటంతో వాళ్ళను మీరు చూడలేదు.''

''అలాగా'' అంటూ నవ్వి ''మీరు చేసిన పని నాకు నచ్చపోయినా యింత గొప్ప ప్లాను ఆలోచించిన మీ మేధస్సుకు మాత్రం నా జోహార్లు అందుకోండి.'' అన్నాడు ఆమె వైపు మెచ్చుకోలుగా చూస్తూ.

ఆమె శెలవు తీసుకుని వెళ్లిపోయాక రమేష్ గుర్తొచ్చాడు ఆదిత్యకు. అతను తనే ఆ అమ్మాయిల్ని ఏర్పాటు చేసినట్లు ఎందుకు చెప్పాడో అర్థమైంది.

'రమేష్! పందెంలో నీ ప్రయత్నం లేకుండానే నీవు గెలిచావు. కాని మనిషిగా మాత్రం నీ మంచితనంతో నన్ను గెలిచావు. యు ఆర్ గ్రేట్.' అనుకున్నాడు మనసులో.